

# 'శిక్ష'

రచన: "శ్రీ నాగశ్రీ"

మాధవి పేషెంట్లను చూచి అప్పుడే వచ్చింది. ఆమె మనస్సు తృప్తిగా ఉంది. "డాక్టరమ్మగోరు మమ్మల్ని బతికీయండీ" అంటూ బ్రతుకు మీద ఆశలొదులుకున్న ఆ పేషెంట్లను ఆరోగ్యవంతులైన మనుషులుగా మార్చింది మాధవి. మాధవి ఆ ఊరికి డాక్టరుగా వచ్చి రెండు సంవత్సరాలు కాకపోయిన, ఆమె నయం చెయ్యలేని జబ్బే లేదని ఆఊరి ప్రజలలో నమ్మకం ఏర్పడింది.

అంతలో ఓ పేషెంట్ విజయగారు వచ్చి మాధవికి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది. "ఆరోగ్యం ఎలాగుందండి?" అని అడిగింది మాధవి. మీరు ట్రీట్‌మెంట్ ఇస్తే ఆరోగ్యానికి లోటేముంటుందండీ అంటూ నవ్వింది ఆవిడ. అలా అలా వాళ్ళమధ్య మాట దొర్లుతున్నాయి. "అసలు నాన్నగారు ఎలా పోయారంటారు" అంటుంది విజయ. "నాన్నగారు లక్షలతో వ్యాపారం చేసేవారు. భాగస్థులు నాన్నగారిని మోసం చేసారు. ఆ పరిస్థితిని నాన్నగారు తట్టుకోలేక గుండె ఆగిపోయారు" అంటు కళ్ళొత్తుకుంది మాధవి. "ఓ! సారీ డాక్టర్ మిమ్మల్ని బాధపెట్టాను" అంటూ లేచింది విజయ. ఆబ్బె లేదండీ అంటూ మాధవికూడ లేచింది.

ఆ తరువాత సెలవుపెట్టేసి ఇంటికి వచ్చింది మాధవి. నాన్నకి తన్ను డాక్టర్ని చెయ్యాలని ఎంత కోరికగా ఉండేది, ఆయన కోర్కెకి ఊపిరి పోస్తున్నట్లు క్లాసు క్లాసును ఫస్టుమార్కులతో వచ్చేది తను. తను డాక్టరు కోర్సులో చేరుతున్నప్పుడు నాన్న కళ్ళలో ఎంతో ఆనందం, తృప్తి కనిపించింది. కాని అ ఆనందంతో మెరిసే నాన్న కళ్ళని ఎంతోకాలం చూడలేకపోయింది తను. ఆ సంవత్సరంలోనే నాన్న పోయారు. ఇలా ఏవేవో గతస్మృతులు ఆమె మనస్సులో తిరుగుతున్నవి.

కొద్దిగా వాన చినుకులు పడుతున్నాయి. "అక్కా" అన్న వేణు పిలుపుతో లేచివెళ్ళి తలుపు తీసింది మాధవి. "చినుకులు పడుతున్నట్లున్నాయి, తడవ లేదుగా? జలుబు చేస్తుంది" అన్న మాధవి మాటలకు "లేదులే అక్కా, అయిన వానలో తడిచినా ఫరవాలేదు, ఎందుకంటే, డాక్టరవు నువ్వేగనుక!" అంటూ నవ్వేసాడు వేణు. నవ్వుతూ అక్కవంక పరిశీలనగా చూచి "ఏంటక్కా అలాగున్నావు? ఏ కేసైన సక్సెస్ కాలేదా"? అంటూ అడిగాడు "అంతా బాగనే ఉందిలే" పరధ్యానంగా అంది మాధవి.

ఆరోజునుంచి మాధవికి ఆరోగ్యం బాగున్నట్లు కనిపించటంలేదు, ఏదో-క్లినిక్కి హాస్పిటల్‌కి వెళ్ళొస్తుందిగాని పేషెంట్లను కూడ సరిగ్గా చూడటంలేదు.

ఓరోజు మాధవి దగ్గరకి ఓవ్యక్తి గాబరాగా వచ్చి "డాక్టర్ ప్లీజ్ ఒక్కసారి అర్జంట్‌గా రావాలి, మానాన్నగారికి మళ్ళీ గుండెనొప్పి వచ్చింది" అన్నాడు. "వస్తున్నాను పదండి"

అంటూ లేచి అటుగా వచ్చిన నర్సుతో "గుండెనొప్పి వచ్చిన పేషెంట్‌ని ఎప్పుడు చేర్చుకున్నారు?" అడిగింది మాధవి. "మీరు సెలవు పెట్టిననాటి కేస్ డాక్టర్" అంటూ మాధవి వెనుక నడిచిందామె.

ఆ పేషెంట్‌ను పరిశీలనగా చూసింది మాధవి. "అవును ధర్మారావే! నాన్నని మానుండి దూరం చేసిన రాక్షసుడు, మోసాలమీద మోసాలు చేసి డబ్బు సంపాదించిన లక్షాధికారి. స్నేహితుడని నమ్మి నాన్న తన వ్యాపారంలో భాగస్తునిగా కలుపుకున్నందుకు అతనిని చంపిన విశ్వాసఘాతకున్ని తను బ్రతికియ్యాలా? లేక బాధ్యత గల ఉద్యోగిగా తన కర్తవ్యం నెరవేర్చాలా? ఏది న్యాయం? ఏ న్యాయాన్ని తాను అనుసరించాలి?" అనుకుంటూ తనరూమ్‌లోనికి నడిచింది మాధవి.

"ఏం డాక్టర్ నాన్నకి ఆనొప్పి తగ్గేమార్గం లేదంటారా?" అంటూ ఆత్రుతగా అడిగాడా వ్యక్తి. "నావల్లకాదు మరెక్కడికైన తీసుకుపొండి" కర్కశంగా అంది మాధవి. "మరెక్కడికి తీసుకుపోయే స్థితిలో లేము" అంటూ ప్రాధేయ పూర్వకంగా అడిగాడా వక్తి. "ఫరవాలేదు మద్రాసు తీసుకుపొండి నాకంటె పెద్ద డాక్టర్లుంటారు" వెక్కిరింతగా అంది మాధవి "అంత స్థోమత లేదు" అన్నాడతడు. ఆశ్చర్యపోయింది మాధవి.

"మోసాల మీద మోసాలు చేసి లక్షలు ఆర్జించిన మీకు మద్రాసు తీసుకు వెళ్ళేస్థోమత లేదా? అని అడిగిందామె. ఈ సారి ఆశ్చర్యపోవటం అతని వంతైనది. ఆశ్చర్యంతో ఆవ్యక్తి ఆమెవైపు పరిశీలనగా చూసాడు. "నన్ను గుర్తుపట్టలేదా? మాధవిని, రాజారావుగారమ్మాయిని" అంటూ తనను పరిచయం చేసుకుంది మాధవి. "మాధవిగారా! ఓసారీ నేను గుర్తుపట్టలేకపోయాను. నువ్వు డాక్టరువైనందుకు కంగ్రాజులేషన్ మాధవి. మీనాన్నని మా నాన్న మోసం చేసినట్లే మానాన్ననికూడ భాగస్తులు మోసం చేసారు. అంతే! మళ్ళీ వ్యాపారంలో నాన్న పైకి రాలేక పోయారు. అప్పటి నుండి సుస్తీగానే ఉంటున్నారు అయినా మోసంతో పైకొచ్చినవారు ఎంతకాలం అపైకుంటారంటావు మాధవి? అంటూ అడిగాడతడు. "నేను చాల విచారిస్తున్నాను" గభీరంగా అంది మాధవి.

ఇంతలో "అక్కా" అంటూ వచ్చినవేణు

Regd. No. 6949 ★

ఎల్లప్పుడూ
హాలెండ్
ఇజిప్షియన్
బనియన్లనే
ఉపయోగించండి.

H.H.M

TRADE MARK ★

* హాలెండ్ ఇనామ్‌ఫైన్.
* హాలెండ్ ఇంటర్‌లాక్.
కరెక్ట్ సైజ్
నైస్ ఫైన్ బనియన్లు
చెడ్డీలు మరియు కాలర్ షర్ట్స్.

ఆంధ్రప్రదేశమంతటనూ ఏజెంట్లు కావలెను.

-: వివరములకు :-

**Holland Hosiery Mills**
14-(2) F, COLLEGE ROAD,
TIRUPUR - 638 602.

-GOLDEN

అక్కడ ఉన్న ఆవ్యక్తిని చూచి ఆశ్చర్యపోతు "ఓహో మధుగారా! అన్నాడు. "అవును వేణు మధునే, నాన్నకి గుండెలో నొప్పొస్తుంది. దానుండి రక్షించమంటె నావల్లకాదంటుంది మీ అక్కయ్య అన్నాడతడు. పాపం మీ నాన్నకు ఇప్పుడు చావంటె ఏమిటో తెలిసొస్తుందా? ఆనాడు నాన్నపోయారంటె "పోనీలే పాపం" అన్నాడు నవ్వుతు. అప్పుడు నాన్న కపట స్నేహితున్ని భాగస్తునిగా ఏరుకున్నందుకు విచారిస్తూ చచ్చిపోయారు. కానీ ఇప్పుడు మీ నాన్న అట్లా కాదు చేసిన పాపాలను అనుభవించి కానీ పోడు ఇలా ఏదేదో కసిగా అంటున్నాడు వేణు.

"ప్లీజ్ మమ్మల్ని మన్నించండి వేణు, మా నాన్నని ఎలాగైన బ్రతికియ్యాలి" అంటూ ప్రాధేయ పడుతున్నాడతడు. "పోనీలేఅక్క దిక్కులేక మనల్ని ప్రాధేయ పడుతున్నాడు, అతన్ని బ్రతికించటం నీ ఉద్యోగ ధర్మం కూడాను. అంటూ అక్కకు సలహా ఇచ్చాడు వేణు. "సరే మీకు లేకపోయిన మానవత్వం మాకుంది. అందుకె ఉద్యోగ ధర్మంగానైన మీనాన్నకు ట్రీట్‌మెంట్ ఇస్తాను. అంది మాధవి." థాంక్స్ అన్నాడతడు.

ఆ తరువాత మాధవి ధర్మారావుని పరీక్షించి మందులిస్తున్నప్పుడు. "నాన్నా ఈమె రాజారావుగారమ్మాయి, మాధవి, అతడు వేణు" అన్నాడు మధు. "ఆఁ! మాధవి! ఏది? అమ్మా మాధవి నన్ను క్షమించమ్మ! మీకు మీనాన్నకు చెయ్యరాని ద్రోహం చేసాను" ఏదేదో అంటున్నాడతడు. "మేమేం క్షమిస్తాములెండి, ఆదేవుడు మన్నిస్తాడేమో కనుక్కోండి" వెటకారంగా అన్నాడు వేణు. అవును బాబు, నాకు ఆదేవుడు ఎన్ని శిక్షలు వేసినా పాపంలేదు. అని అంటున్న అతనికి గుండెపోటు రావడంతో బెడ్ మీద పడిపోయాడు.

★




చిరకాల అనుభవస్థులైన పనివారలచే మేము అత్యాకర్షణీయమైన జంకాళాలు మరియు బెడ్ షీట్లను తయారుచేస్తున్నాము.

ఆర్డరు ఇచ్చిన వెంటనే సరకు పంపగలము.

(ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులోనే)

: వివరములకు :

TEL: "AEKENTEX"

ఎ. కె. ఎన్. టెక్స్‌టైల్స్

భవాని – 638 302.